హుండీ లెక్కింపు..

చిక్కడపల్లి, వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ పర్యవేక్షణలో హుండీ లెక్కించారు. ఈ సందర్భంగా దేవాలయ కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం మాట్లాడుతూ.. నెల రోజులకు గాను రూ. 1,12,953 వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅర్చకులు లక్ష్మీపతి శర్మ, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. - చిక్కడపల్లి, మార్చి 20

శుభాకాంక్షలు

ఇన్‌చార్జి గవర్నర్‌గా పదవీ బాధ్యతలను స్వీకరించిన సీపీ రాధాకృష్ణన్‌ను పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం జాంబాగ్ కార్పొరేటర్ రాకేశ్ జైస్వాల్ రాజ్‌భవన్‌లో నూతన ఇన్‌చార్జి గవర్నర్‌ను కలిసి పుష్పగుచ్చం అందజేశారు. కార్యక్రమంలో అమర్‌సింగ్, నవీన్ భండారి, బబ్లూసింగ్ పాల్గొన్నారు. - అబిడ్స్, మార్చి 20

బీసీలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాలి

చిక్కడపల్లి, మార్చి 20 : సబ్బండ వర్గాల మద్దతుతో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వంలో బీసీలకు అవకాశాలు లేక సామాజిక న్యాయం కుంటుపడుతోందని బీసీ నాయకులు, ఉద్యమకారులు ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజా పాలనలో బీసీల భాగస్వామ్యం లేకపోతే సామాజిక న్యాయం ఎలా సాధ్యం అని సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీని ప్రశ్నించారు. బాగ్‌లింగంపల్లిలోని బీసీ రాజ్యాధికార సమితి కేంద్ర కార్యాలయంలో బుధవారం బీసీ నాయకులు, ఉద్యమకారులు, ప్రజా సంఘాల నాయకులు, మేధావులు,నిరుద్యోగులు, ఆర్టీసీ కార్మికులు తమకు ప్రభుత్వ పదవులు దక్కాల్సిన వాటాపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సరేశ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా సామాజిక న్యాయం కోసం పోరాటం చేస్తుండగా తెలంగాణలో పదవులన్నీ అగ్రవర్ణ రెడ్డి సామాజికవర్గానికే పరిమితం అవుతున్నాయని మండిపడ్డారు. కేవలం కాంగ్రెస్ పార్టీ నాయకులకు మాత్రమే కాకుండా ప్రజా పోరాటాలతో మద్దతుగా నిలిచిన, సివిల్ సొసైటీ నాయకులకు ప్రాధాన్యత కలిగిన నామినేటెడ్ పదవులలో అవకాశాలు ఇవ్వాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ఈ విషయాలను పరిగణలోకి తీసుకుని బీసీల ఆర్థిక స్థితి గతుల ఎదుగుదలకు సహకరించాలని కోరారు. సమావేశంలో బీసీ రాజ్యాధికార సమితి గౌరవ అధ్యక్షుడు దొంత ఆనందం, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, సమితి మహిళా కన్వీనర్ బోనం ఊర్మిళ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండ స్వామి, నిరుద్యోగ జేఏసీ అధ్యక్షుడు నీలం వెంకటేశ్, సమితి వ్యవస్థాపక సభ్యురాలు దోనేటి కృష్ణల, గ్రేటర్ అధ్యక్షురాలు పద్మావతి, ప్రధాన కార్యదర్శి స్వప్న, మీడియా సెక్రెటరీ మారేపల్లి లక్ష్మణ్, తులసీ శ్రీను, బీసీ నాయకులు ప్రొఫెసర్ ప్రభంజన్ యాదవ్, మధుసూదన్, సుధాకర్, కాలసముద్రం సుధాకర్, వీరస్వామి యాదవ్, దామెరకొండ కొమురయ్య, నాగభూషణం పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సరేశ్

ఉద్యమ ద్రోహులే పార్టీ వీడుతున్నారు..

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కోడూరు శ్రీధర్ సాగర్

కార్వాన్, మార్చి20 : తెలంగాణ ఉద్యమ ద్రోహులే బీఆర్ఎస్‌ను విడుతున్నారని ఉద్యమం నుంచి పార్టీలో ఉన్న నాయకులెవరూ పార్టీ వీడడం లేదని బీఆర్ఎస్ కార్వాన్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు కోడూరు శ్రీధర్ సాగర్ అన్నారు. నియోజకవర్గానికి చెందిన కొందరు పార్టీని వీడి కాంగ్రెస్‌లోని వెళుతుండడం పై ఆయన బుధవారం తన కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పట్లూరి రఘు, చంద్రశేఖర్, కె. శేఖర్, రాజేశ్వర్ లాల్, యాదగిరి, రేణుకా యాదవ్, లావణ్య రెడ్డి, అయేషా మీనా, స్రవంతి, మంజుల పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్

ప్రజలకు శాంతి, భద్రతలను అందించడానికి పోలీసులు కృషి చేస్తున్నారని బంజారాహిల్స్ ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మాసాబ్‌ట్యాంక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏసీ గార్డ్స్, ఫస్ట్‌లాన్సర్ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ ఫ్లాగ్‌మార్చ్‌లో అదనపు బలగాలతో పాటు, మాసాబ్‌ట్యాంక్ పోలీసులు పాల్గొన్నారు. ఏసీపీ వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ గంగాధర్ గౌరి, ఎస్సైలు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. - మెహిదీపట్నం, మార్చి 20

రక్తదానం చేసి .. ప్రాణాలు కాపాడాలి

చిక్కడపల్లి, మార్చి 20 : రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలని ఆర్ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి జన్మదినం పురస్కరించుకుని ఆర్ఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లి లోని జీజీ చారిటీ హాస్పిటల్ లో రక్తదాన శిబిరంను నిర్వహించారు. శిబిరాన్ని సుచరిత రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో జైజై చారిటీ ఆసుపత్రి చైర్మన్ గంగాధర్ గుప్తా, పీఆర్ఆర్ ఫౌండేషన్ సభ్యులు శ్రేష్ఠి, సురేశ్, శికుమార్, నవీన్ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్ఆర్ఆర్ ఫౌండేషన్ డైరెక్టర్ సుచరిత రెడ్డి

సామాజిక సేవలో ముందుండాలి

41 ఏండ్లుగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, నిరక్షరాస్యత, మురికివాడల్లో నివసించే చిన్నారులను పాఠశాలలో చేర్చించేందుకు విశేషంగా కృషి చేసిన ప్రేరణ బాలల వేధిక వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అక్కెనపల్లి లక్ష్మణాచారికి స్వచ్ఛంద సంస్థల సంక్షేమ సంఘం, ఆర్కే ఫౌండేషన్ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేసి, సన్మానించారు. బుధవారం విలేకరులతో డాక్టర్ లక్ష్మణాచారి మాట్లాడుతూ.. సామాజిక భావంతో ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రామకృష్ణ, బి.దాస్, మోతే కృష్ణ పాల్గొన్నారు. - కాచిగూడ, మార్చి 20

యంగిస్థాన్ ఫౌండేషన్ అవార్డులు ప్రదానం

యంగిస్థాన్ ఫౌండేషన్ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం ఘనంగా నిర్వహించారు. కోఠిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వలంటీర్‌లను అత్యుత్తమ వలంటీర్ అవార్డు, ఎంవీపీ అవార్డు, స్పాట్‌లైట్ అవార్డు, చేంజ్ మేకర్ అవార్డు, మావెరిక్ అవార్డు, ప్రతిష్టాత్మక డ్రీమ్ టీంఅవార్డులతో సన్మానించారు. యంగిస్థాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అరుణ్ డేనియల్ ఎల్లమటి మాట్లాడుతూ.. దేశ జనాభాలో 60 శాతాని కంటే ఎక్కువ మంది 35 ఏండ్ల లోపు ఉన్నారని, యంగిస్థాన్ ద్వారా చురుకైన పౌరసత్వం, సామాజిక మెరుగుదల, సంస్కృతిని పెంపొందించే సానుకూల మార్పు కోసం యువతకు సహాయం చేస్తున్నట్లు తెలిపారు. 2014లో ప్రారంభమైన తమ ఫౌండేషన్ 70 వేల మంది యువకులను బలోపేతం చేసిందన్నారు. - అబిడ్స్, మార్చి 20

స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటీష్ వారిపై ఎదురొడ్డి పోరాడిన వీరనారి రాణి అవంతిబాయి లోధ అని గోషామహల్ కార్పొరేటర్ లాల్‌సింగ్, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరిసింగ్ పేర్కొన్నారు. బుధవారం రాణి అవంతిబాయి బలిదాన్ దివస్‌ను పురస్కరించుకొని జుమ్మెరాత్‌బజార్‌లోని రాణి అవంతిబాయి విగ్రహానికి వారు పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. - అబిడ్స్, మార్చి 20

తెలంగాణ మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా నియమితులైన మెట్టు సాయికుమార్ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిసి సన్మానించారు. తనకు ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మత్స్యకార పారిశ్రామిక సహకార సంఘాల సమాఖ్య చైర్మన్‌గా మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కారానికి పాటు పడ్తానని సాయికుమార్ తెలిపారు. - అబిడ్స్, మార్చి 20

సమస్యల పరిష్కారానికి కృషి

డ్రైనేజీ, తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. బుధవారం లంగర్ హౌస్ డివిజన్ గోల్కొండ సాలెనగర్ కంచ ప్రాంతంలో ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, కార్పొరేటర్ ప్రతినిధి వజీ ఉజ్జమాసిద్ధిఖీతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాగునీరు, డ్రైనేజీ సమస్యలపై ఫిర్యాదులు చేశారు. వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. - మెహిదీపట్నం, మార్చి 20

ఆలయాభివృద్ధికి కృషి

శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.గోపాల్‌రావు అన్నారు. బుధవారం శివలింగం విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా ఉదయం 4 గంటల నుంచి హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాల్‌రావు మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో భక్తిభావం పెంపొందించుకోవాలని సూచించారు. పూజల అనంతరం అన్నప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు రాజ్‌కుమార్ విగ్, వీరస్వామి,సాయిగిరిధర్, రతన్ విద్యాసాగర్, బి.కృష్ణాగౌడ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, యాదయ్య పాల్గొన్నారు. - కాచిగూడ, మార్చి 20

వీరన్నగుట్టలోని శ్యామ్‌బాబా మందిర్‌లో నిర్వహిస్తున్న ఫాల్గుణి మేళాలో కాచిగూడ కార్పొరేటర్ ఉమా రమేశ్‌యాదవ్ పాల్గొన్నారు. శ్యామ్‌బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో కన్నె రమేశ్‌యాదవ్, రాందేవ్ అగర్వాల్, సుభాష్ పటేల్, భీంరాజ్ పాల్గొన్నారు. - కాచిగూడ, మార్చి 20

వైభవంగా ఫాల్గుణి మేళా..

శ్యామ్‌బాబా మందిర్‌లో నిర్వహించిన నిషాన్ శోభాయాత్రలో యువతీయువకులు తమ భక్తిని చాటుకున్నారు. కలియుగ కృష్ణుడిగా పేరొందిన శ్యామ్‌బాబా మహాభారత యుద్ధంలో తన శిరస్సును శ్రీకృష్ణునికి దానమిచ్చే రోజుగా ఫాల్గుణి మేళాను చెబుతారు. శ్యామ్‌బాబాకు 56 వివిధ రకాల నేతి మిఠాయిలను పూజారులు సమర్పించారు. కార్యక్రమంలో శ్రీ శ్యామ్‌మందిర్ సేవా సమితి అధ్యక్షుడు చంద్రకాంత్ డకోటియా, కార్యదర్శి ఇందర్‌కరణ్ అగర్వాల్, శశికుమార్,రాందేవ్ అగర్వాల్, ఇంద్రకుమార్ అగర్వాల్, రాజ్‌కుమార్‌విగ్, కపిల్ అగర్వాల్, సురేశ్ అగర్వాల్, రాజేశ్, కైలాశ్ పాల్గొన్నారు. - కాచిగూడ, మార్చి 20

చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డిని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు నర్సింహాగౌడ్, రాజు గౌడ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. - మెహిదీపట్నం, మార్చి 20

నాంపల్లి రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

- సరైన పత్రాలు లేకపోవడంతో ఫ్యాన్ బాక్సులు సీజ్

తెలుగు యూనివర్సిటీ, మార్చి 20: ఎన్నికల నేపథ్యంలో నాంపల్లి రైల్వే పోలీసులు తనిఖీలు చేపట్టారు. సరైన పత్రాలు లేకుండా రైల్వే పార్సిల్ సర్వీస్ ద్వారా టేబుల్ ఫ్యాన్లను తరలిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఇన్‌స్పెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. ఎన్నికల నేపథ్యంలో నాంపల్లి రైల్వే స్టేషన్‌లోని పార్సిల్ కౌంటర్ వద్ద ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేపట్టింది. 199 కాటన్ బాక్సులలో కర్ణాటక హుబ్లీకి తరలించేందుకు సిద్ధం చేసిన 826 టేబుల్ ఫ్యాన్లను గుర్తించారు. ఆ ఫ్యాన్లకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో విచారణ చేపట్టారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆగాపురా సీటీఓ అధికారులకు సమాచారం అందించి.. తదుపరి చర్యల నిమిత్తం ఫ్యాన్లతో ఉన్న కాటన్ డబ్బాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఈ తనిఖీల్లో సిబ్బంది శ్రీనివాస్, సాయి, కోటేశ్వరరావు, షకీల్ పాషాతో పాటు ఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నట్లు ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్ వెల్లడించారు.

పద్మశాలి ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అఖిల భారత పద్మశాలి సంఘం నాయకులు

రవీంద్రభారతి, మార్చి 20 : పద్మశాలీల ప్రగతి కోసం ప్రత్యేక శ్రద్ధ వహించిన బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు పద్మశాలీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు గాను అఖిల భారత పద్మశాలి సంక్షేమ సంఘం సీఎం ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో సంఘం అధ్యక్షుడు తుమ్మ సత్యనారాయణ మాట్లాడుతూ.. పద్మశాలీలకు జీవనోపాధి సమకూర్చుకొనుటకు కార్పొరేషన్ ఏర్పాటు చేయడంతో అభినందనలు తెలిపారు. సూర్యపల్లి రవికుమార్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా,ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని, ఒక రాజ్యసభ సీటుతో పాటు నాలుగు శాసనమండలి స్థానాలు, ఆరు కార్పొరేషన్ చైర్మన్ పదవులను కల్పించాన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు చేనేత దుస్తులను వారానికి ఒక రోజు ధరించే విధంగా ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలన్నారు.

ఉస్మానియా యూనివర్సిటీ , తెలంగాణ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ఎయిడ్స్ పై అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ పినపాటి ప్రసాద్, స్టేట్ కో ఆర్డినేటర్ ఎం.రమేశ్ హాజరయ్యారు. హెచ్ ఐవీ వ్యాప్తి పూర్తిగా నిర్మూలించడానికి ప్రజల్లో అవగాహన పెంచాలని విద్యార్థులకు వారు సూచించారు. - చిక్కడపల్లి, మార్చి20

అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం..

అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పోరాటాలు చేశారని మాల కులాల యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు దయానంద్ అన్నారు. దళితుల తాగునీటి కోసం 1927 మార్చి 20న అంబేద్కర్ చేపట్టిన మహాడ్ సత్యాగ్రహాన్ని గుర్తు చేస్తూ బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద పలు దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. దయానంద్ మాట్లాడుతూ.. అంబేద్కర్ పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ సమానత్వం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. - కవాడిగూడ, మార్చి 20

యువకుడు అదృశ్యం

అంబర్‌పేట, మార్చి 20 : ఊరికి వెళ్తానని చెప్పి తన స్నేహితుడి రూం నుంచి బయలుదేరిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం..అనిల్ నల్లకుంటలో నివాసముంటున్నాడు. అతడి అంకుల్ కుమారుడు గునికి రాళ్ల రాము పనినిమిత్తం ఆరు నెలలుగా అనిల్ రూంలో ఉంటున్నాడు. స్థానిక హోండా షోరూంలో పనికి కుదిరాడు. ఈ నెల 11న ఉదయం సొంతూరు కర్నూలుకు వెళ్తున్నానని అనిల్‌కు

చెప్పి వెళ్లాడు. అనిల్ తర్వాత రాము తల్లికి ఫోన్ చేయగా, ఇంకా చేరుకోలేదని చెప్పింది. రాము ఆచూకీ కోసం అంతటా వెదికినా ఫలితం లేకపోవడంతో నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉన్నది.

బీజేపీకి గుణపాఠం చెప్పడం ఖాయం

పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి గుణపాఠం చెబుతారని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరి సతీశ్ పేర్కొన్నారు. బుధవారం నాంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో 10 ఏండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం యువత, రైతులు, ఉద్యోగులకు సమాధానం చెప్పిన తర్వాత పార్లమెంట్ ఎన్నికలలో ఓట్లు అడగాలన్నారు. - అబిడ్స్, మార్చి 20

నకిలీ పత్రాలతో ప్లాట్ కాజేయడానికి యత్నం

- ముగ్గురు అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు

మెహిదీపట్నం మార్చి 20 : భూములకు సంబంధించిన నకిలీ పత్రాలతో అమాయకులను మోసం చేస్తున్న ఓ ముఠాలోని ముగ్గురిని లంగర్‌హౌస్ పోలీసులు బుధవారం సాయంత్రం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పీఎస్‌లో విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్,ఎస్ఐ సత్యనరేంద్రతో కలిసి వివరాలను వెల్లడించారు. శాస్త్రీ పురానికి చెందిన మహ్మద్ అయూబ్, జంగమ్మెట్‌కు చెందిన నవాబ్ మీర్ అక్రం అలీ ఖాన్, చార్మినార్ గాజిబండకు చెందిన అహ్మద్ ఖాన్, షహబాజ్, డాక్టర్ ఇలియాస్ ముఠాగా ఏర్పడి ఖాళీ స్థలాలకు నకిలీ పత్రాలు తయారు చేసి, సంతకాలను ఫోర్జరీ చేసి అమాయకులకు అమ్ముతూ మోసాలకు పాల్పడుతున్నారు. ముఠాలోని షెహబాజ్ ఖాళీ స్థలాలను గుర్తించి వాటికి సంబంధించిన నకిలీ పత్రాలుతయారు చేసి ముఠాకు అందిస్తాడు. దాన్ని అమ్మిన తర్వాత వచ్చిన డబ్బులను ఐదుగురు సమానంగా పంచుకుంటారు. ఇదిలా ఉండగా లంగర్‌హౌస్ సర్దార్ బాగ్‌లో ఓ మహిళకు చెందిన ప్లాట్‌ను నకిలీ పత్రాలతో సయ్యద్ సోహైల్ కు ఈ ముఠా అమ్మడానికి ప్రయత్నించారు. అనుమానం వచ్చిన సయ్యద్ సోహైల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టి బుధవారం ముఠాను పట్టుకున్నారు. పోలీసులకు ముగ్గురు పట్టుబడగా షెహబాజ్, డాక్టర్ ఇలియాస్ పరారీలో ఉన్నారు.

శోభన్‌బాబు క్రమశిక్షణ స్ఫూర్తి సేవా పురస్కారాలు

రవీంద్రభారతి, మార్చి 20 : శృతిలయ ఆర్ట్స్ అకాడమీ, సీల్‌వెల్ కార్పొరేషన్, ఆర్.ఆర్.ఫౌండేషన్ ఆధ్వర్యంలో నటుడు శోభన్‌బాబు దివ్యస్మృతిలో మహిళా దినోత్సవం సందర్భంగా సినీనటుడు శోభన్‌బాబు క్రమ శిక్షణ స్ఫూర్తి సేవ పురస్కారాలు, శృతిలయ సీల్‌వెల్ స్త్రీ శక్తి పురస్కారాల ప్రదానం బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు.

కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి విచ్చేశారు. గాయని ఆమని బృందంచే శోభన్‌బాబు సినీ సుస్వరాలను ఆలపించారు. పద్మశ్రీ ఉమామహేశ్వరి, విజయలక్ష్మిశర్మ, వనజా ఉదయ్, జయప్రదరాంమూర్తి, సమ్మెట విజయ, పి.అపర్ణ, డా.కె.స్వరూప, డా.నిరుపమ సునేత్రి సీల్‌వెల్ శ్రీశక్తి అవార్డులు, కె.వి.రావు, జి.ఎస్. కుమారస్వామి, డా.సునీల్ దాచేపల్లి శోభన్ బాబు క్రమశిక్షణా పురస్కారాలు స్వీకరించారు.

పిల్లల రక్షణ బాధ్యత బాలల కమిటీలపై ..

బాలల పరిరక్షణ కమిటీలపై ఉందని వక్తలు పేర్కొన్నారు. సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్ఆర్‌డీ)స్వచ్ఛంద సంస్థ, రెయిన్ బో ఫౌండేషన్ ఇండియా ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీల సభ్యులకు బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చైల్డ్ వెల్ఫేర్ అసిస్టెంట్ డైరెక్టర్ నాగేశ్వర రావు మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాలైన ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనియన్ యూనిట్ దృష్టికి తీసుకోరావాలిన సూచించారు. సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు ఎంఎస్ ప్రమోద్ , ఎస్ఆర్‌డీ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎంవీ ఫౌండేషన్ ప్రతినిధి రాజేంద్ర ప్రసాద్, శైలజ, మల్లేశ్, సునంద్ పాల్గొన్నారు. - చిక్కడపల్లి, మార్చి 20